సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 21 । జనవరి । 2025



అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జేసీ అధికారులను ఆదేశించారు. - 8లో



దేవాలయ స్థలంలో అక్రమ కట్టడాలు

కడప-రాయచోటి జాతీయ రహదారి నుంచి కొత్తపేట గంగమ్మ గుడికి వెళ్లే రోడ్డులో అక్రమ కట్టడాలు వెలిశాయి. - 8లో

గరిష్టం/కనిష్టం 29.8 /17.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 17.6 – 29.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ప్రైవేటు ఆసుపత్రి మూత



ఆస్పత్రికి క్లోజ్‌డ్ స్టిక్కర్ అంటించిన అధికారి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి ఆసుపత్రిని సోమవారం జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మల్లేష్ మూసి వేయించారు. ఇక్కడి వైద్యుడు చేసిన చికిత్స వికటించి రామాయపల్లెకు చెందిన కారు రామయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సోమవాం జిల్లా అధికారి విచారణకు వచ్చారు. సదరు డాక్టర్ లేకపోవడంతో ఆస్పత్రికి క్లోజ్‌డ్ స్టిక్కర్ అంటించారు. అంతకు ముందు ఎస్‌ఐ కొండారెడ్డితో అధికారి మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక తగిన నిర్ణయం తీసుకుంటామని జిల్లా అధికారి తెలిపారు. ఆయన వెంట ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ ఉన్నారు.

డీఈఓగా షంషుద్దీన్ నియామకం



కడప ఎడ్యుకేషన్ : జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ)గా షంషుద్దీన్ నియమితులయారు. కర్నూల్ జిల్లా తాండ్రపాడు డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న షంషుద్దీన్‌ను వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కొన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. నేడో, రేపో ఆయన బాధ్యతలను చేపట్టనున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం డీఈఓగా పనిచేస్తున్న మీనాక్షిని ప్రొద్దుటూరు డిప్యూటి ఈఓగా కొనసాగించనున్నట్లు తెలిసింది. ఆమెపై పలు ఆరోపణలు రావడంతోపాటు ఉపాధ్యాయ సంఘాలు ఆమెకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే.

హుండీ ఆదాయం లెక్కింపు



బి.మఠంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రెండు నెలలపాటు భక్తులు సమర్పించిన కానుకలను ఇందులో లెక్కించారు. మఠం ఆవరణలో ప్రొద్దుటూరు, మైదుకూరు, పట్టణాలకు చెందిన దాదాపు 50మంది మహిళా భక్తులు డ్రస్ కోడుతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.23,30,585 నగదు, 200గ్రాముల బంగారం, 90 గ్రాముల వెండి వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి, ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, పూర్వపు మఠాధిపతి కుమారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'కేతు' పతకానికి చెక్కు అందజేత



కేతు శశికాంత్‌ను సత్కరించి జ్ఞాపికను బహుకరిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : వైవీయూ తెలుగుశాఖలో ప్రతిభావంతులకు ఏటా కేతు విశ్వనాథరెడ్డి పేరిట స్మారక బంగారు పతకం, నగదు బహుమతి అందజేసేందుకు ఆయన కుమారుడు కేతు శశికాంత్ రూ.3.5 లక్షల చెక్కును యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ మేరకు ఆచార్య కృష్ణారెడ్డి సమక్షంలో విద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి కేతు శశికాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం చెక్కులను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రఖ్యాత విద్యావేత్త, ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకుడు ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి పేరిట అవార్డు నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. సాంస్కృతిక వారసత్వానికి బలమైన పునాది వేసిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడన్నారు. ఆచార్య రఘునాథ రెడ్డి కేతు సేవలను కొనియాడారు. దివంగత ప్రొఫెసర్ కేతు విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు కేతు పద్మావతమ్మ, కేతు శశికాంత్, కేతు మాధవి, శిరీషలను వీసీ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎ.జి.దాము పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం!

- కేజీబీవీల్లో ఉత్తమ ఫలితాల కోసం పంచతంత్ర ప్రణాళిక అమలు
- ప్రారంభమైన స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షలు



జిల్లాలో మొత్తం కేజీబీవీలు	: 17
కేజీబీవీల్లో మొత్తం విద్యార్థులు	: 4209
పదో తరగతి చదువుతున్న విద్యార్థులు	: 621
ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు	: 548
ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు	: 363



జిల్లాలోని వేముల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి బంగరు భవితకు బాట వేయాలన్నా.. ఉన్నత లక్ష్యం వైపు పయనించాలన్నా పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కులే కీలకం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పది, ఇంటర్‌లలో కేజీబీవీలలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు 'పంచతంత్ర' పేరుతో ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ తరగతులను నిర్వహిస్తున్నారు. వారంతపు పరీక్షలు, గ్రాండ్ టెస్టులు పెడుతున్నారు. దీంతోపాటు చదువులో వెనుకబడిన పిల్లలను సైతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు సీఆర్‌టీ, పీజీటీలతోపాటు ప్రిన్సిపాల్స్‌కు పలు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు గ్రాండ్ టెస్టులు, ఎనిమిది వారాంత పరీక్షలను నిర్వహించారు.

జిల్లాలో 17 కేజీబీవీలు...

జిల్లాలో 17 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో పదో తరగతికి సంబంధించి 621 మంది విద్యార్థులు చదువుతుండగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 548, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 363 మంది చదువుతున్నారు. వీరందరి కోసం సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు ప్రత్యేకంగా పంచతంత్ర ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇందుకోసం కేజీబీవీలో పనిచేస్తే ప్రిన్సిపాల్స్‌తోపాటు సీఆర్టీ, పీజీటీలు కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు. ఏయే సజెక్టుల్లో వెనుకబడి ఉన్నారనే అంశాలను పరిశీలిస్తూ.. ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ మొత్తం కార్యాచరణ అమలును కేజీబీవీల జీసీడీఓ పర్యవేక్షిస్తారు.

ప్రణాళిక ఇలా...

కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టు రాష్ట్ర అధికారులు 'పంచతంత్ర' పేరుతో వంద రోజుల ప్రణాళిక తయారు చేశారు. ఈ ప్రణాళిక అన్ని కేజీబీవీల్లో ఇప్పటికే ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి సబ్జెక్టు ప్రిపరేషన్‌తో రోజు మొదలవుతుంది. రాత్రి 10 వరకు ఆయా సబ్జెక్టులపై టెస్టులు, స్టడీ అవర్‌లు కొనసాగుతాయి. దీంతోపాటు ఎస్‌సీఈఆర్టీ మోడల్ పేపర్లను కేజీబీవీలకు అందించి సాధన చేయిస్తున్నారు.

ఉత్తమ మార్కులు సాధిస్తా..



పదో తరగతి పరీక్షల కోసం కష్టపడి చదువుతున్నా. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధిస్తా. ఇందుకోసం మా కేజీబీవీలో ప్రిన్సిపాల్, సీఆర్‌టీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మమ్మల్ని చదివిస్తున్నారు. నేను బాగా చదివి మంచి మార్కులను సాధించి మా కేజీబీవీతోపాటు మా ప్రిన్సిపాల్, సీఆర్‌టీలకు మంచి పేరు తీసుకొస్తా.

– మధులత, 10వ తరగతి విద్యార్థి, కేజీబీవీ కలసపాడు

వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు...



మా కేజీబీవీలో ఈ ఏడాది పది, ఇంటర్‌లలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది పది, ఇంటర్ ఫస్ట్, సెకెండియర్లలో కలిసి 88 మంది విద్యార్థులు ఉన్నారు. వారంతా వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– విజయ, ప్రిన్సిపాల్, కేజీబీవీ, మైదుకూరు.

కేజీబీవీలను సందర్శిస్తున్నాం



ఈ ఏడాది జిల్లాలోని అన్ని కేజీబీవీలలో ఉత్తమ ఫలితాల సాధించేందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టు అమలు చేస్తున్న పంచతంత్ర ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. ఇందుకోసం ప్రతి రోజు ఒకటి రెండు కేజీబీవీలను సందర్శిస్తూ అక్కడ సిబ్బందితోపాటు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు సలహాలను ఇస్తున్నాం. ఖచ్చితంగా ఈ సారి మంచి మార్కులతోపాటు మంచి ఫలితాలను సాధిస్తాం.

– అనిత, బీసీడీఓ. కేజీబీవీ స్కూల్స్.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



అన్ని కేజీబీవీల్లో వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలి. దీంతోపాటు సమగ్రశిక్ష ప్రాజెక్టు ప్రవేశ పెట్టిన పంచతంత్ర ప్రణాళిక పక్కాగా అమలు జరగాలి. ఈ విషయంలో ఏ కేజీబీవీ సిబ్బంది కూడా నిర్లక్ష్యం వహించరాదు. దీంతోపాటు డిప్యూటీ ఈఓ, ఎంఈఓలు, జీసీడీఓ కేజీబీవీలను సందర్శించి పర్యవేక్షించాలి. మంచి ఫలితాల సాధనకు ప్రత్యేక దృష్టిని సారించి కృషి చేయాలి.

– నిత్యానందరాజులు, ఏపీసీ, సమగ్రశిక్ష. కడప

నూతన ఎస్పీగా ఈ.జి. అశోక్‌కుమార్



కడప అర్బన్ : జిల్లా నూతన ఎస్పీగా ఈ.జి. అశోక్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్ ఉత్తర్వులను జారీ చేశారు. సుమారు రెండున్నర నెలల తర్వాత జిల్లాకు కొత్త ఎస్పీ రానున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు బదిలీ తర్వాత అన్నమయ్య జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు ఇన్‌ఛార్జ్ ఎస్పీగా కొనసాగారు. కాగా, ఇటీవల అదనపు ఎస్పీ నుంచి ఎస్పీగా పదోన్నతి పొందిన కొందరిలో ఈ.జి అశోక్‌కుమార్ ఒకరు. ఈయన గతంలో కడప డీఎస్పీగా పనిచేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త ఉదయశ్రీ కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు, ఇంగ్లీష్ మాధ్యమంలో చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్స్ నకళ్లను ఒక సెట్ జతపరిచి ఈనెల 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు కలెక్టరేట్ డి-బ్లాక్‌లో గల ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని పేర్కొన్నారు. అలాగే 23వ తేదీన కడప చిన్న చౌక్ గురుకుల పాఠశాలలో నిర్వహించే ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌తో పాటు డెమో ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

29 నుంచి దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ అధికారులు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. సోమవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 28న అంకురార్పణ జరుగుతుందన్నారు. జనవరి 29వ తేదీ ఉదయం 9.30 గంటలకు మీన లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆయన వివరించారు. అలాగే ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజు హరికథలు, భక్తి సంగీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, ప్రశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు

29వ తేది ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, 30న సూర్యప్రభ, పెద్దశేష వాహనం, 31న చిన్నశేష, సింహ వాహన సేవలు, ఫిబ్రవరి 1న కల్ప వృక్ష, హనుమంత వాహన సేవలు, 2న ముత్యపుపందిరి, గరుడ వాహన సేవలు ఉంటాయి. 3న కల్యాణోత్సవం, గజవాహనం, 4న రథోత్సవం, 5న సర్వభూపాల, అశ్వవాహన సేవలు, 6న వసంతోత్సవం, చక్రస్నానం,7న పుష్పయాగం ఉంటుందని వివరించారు.

మార్కెట్ నిర్మాణానికి నిధుల్లేవట!

- మున్సిపల్ నిధుల నుంచి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు
- కంగుతిన్న నేతలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మున్సిపల్ మార్కెట్ నిర్మాణానికి నిధులు ఇవ్వలేమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణానికి అవసరమయ్యే నిధులను మున్సిపాలిటీ నుంచే ఇవ్వాలని అందులో పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాలను చూసిన స్థానిక నేతలు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రొద్దుటూరు పట్టణంలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన కూరగాయల మార్కెట్ అధ్వానంగా ఉండేది. మహిళలు నిత్యం మార్కెట్‌కు వెళ్లి ఇబ్బందులు పడేవారు. ప్రొద్దుటూరు పట్టణానికి సంబంధించి ప్రతి ఒక్కరి నోటా మార్కెట్ సమస్య పరిష్కారం గురించిన చర్చే జరిగేది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి మార్కెట్ నిర్మాణం కోసం తీవ్రంగా కృషి చేశారు. ఉన్న మార్కెట్‌ను ఎంతో ధైర్య సాహసాలతో కూల్చివేయించి కొత్త మార్కెట్ నిర్మాణాన్ని మంజూరు చేయించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో చర్చించి రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా మార్కెట్ నిర్మాణానికి రూ.50.90 కోట్లు నిధులు మంజూరు చేయించారు. 2022 నుంచి పనులు ప్రారంభించారు. సాంకేతిక సమస్యలను గుర్తించిన ఇంజనీరింగ్ నిపుణులు అంచనాలను సవరించి రూ.60.85 కోట్లకు పెంచారు. ఇసుక సమస్య కారణంగా నిర్మాణంలో జాప్యం జరిగింది. మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు రూ.21కోట్లు విడుదల చేశారు.

మార్కెట్ నిర్మాణానికి నిధులు లేవు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ నిర్మాణానికి నిధులు లేవని ప్రభుత్వం ఈనెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ డి.మరియన్న ఈ మేరకు అనంతపురం ఎస్ఈకి లేఖ రాశారు. ఇక నుంచి మార్కెట్ నిర్మాణానికి అవసరమయ్యే నిధులను మున్సిపల్ నిధుల నుంచే కేటాయించాలని కోరారు. ఈమేరకు కౌన్సిల్‌లో ఆమోదం పొందాలని సూచించినట్లు తెలుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరుకు రకరకాల నిధులు వస్తాయని ప్రజలు ఆశిస్తుండగా గత ప్రభుత్వంలో మంజూరు చేసిన మార్కెట్ నిర్మాణానికే నిధులు లేవని చెప్పడం చర్చాంశనీయంగా మారింది.



శివాలయం వద్ద నిర్మాణంలో ఉన్న మార్కెట్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



మార్కెట్ నిర్మాణానికి సంబంధించి నిధుల విషయంపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వంతో మాట్లాడి ఆయన నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇక్కడ నిధుల కొరత ఉంది.

– వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

సివిల్స్ విజేతలు..తీర్చేనా సమస్యలు!

- రాజంపేటకు దక్కిన బ్యూరోక్రాట్స్ పరిపాలన
- జిల్లా అటవీశాఖ కార్యాలయం ఏర్పాటు
- రెవెన్యూలో ఐఏఎస్ పాలన
- ఐపీఎస్ చేతుల్లోకి ఖాకీ పగ్గాలు



రాజంపేట : ఉభయ జిల్లాలో ప్రత్యేకస్థానం కలిగిన పార్లమెంట్ కేంద్రమైన రాజంపేటలో ఇక బ్యూరోక్రాట్స్ పరిపాలన కొనసాగనుంది. ఇక్కడ రాజ్యాంగం, చట్టం సక్రమంగా అమలుకానుందని, అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేస్తారని.. పేదలకు మేలు జరుగుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇక్కడ ఉన్న డివిజన్ ఫారెస్టు కార్యాలయం జిల్లా అటవీశాఖ కార్యాలయంగా రూపుదిద్దుకుంది. బ్రిటీషు కాలం నుంచి రాజంపేటలో ఐఏఎస్ పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దీంతో జిల్లా పాలనహోదాతో ఐఏఎస్,ఐపీఎస్, ఐఎఫ్ఎస్ కలిగిన అధికారులతో ఇక్కడ కొత్త పుంతలు తొక్కనుంది. ఆ దిశగా జిల్లా హోదా కొనసాగుతుందని ఆశలు పుట్టుకొచ్చాయి.

జిల్లా హెడ్‌క్వార్టర్‌లా ఫీలింగ్స్

ఒక రకంగా రాజంపేట వాసుల్లో జిల్లా హెడ్‌క్వార్టర్ అన్న ఫీలింగ్ కలుగుతోంది. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేట, రాయచోటి, మదనపల్లె సభల్లో తన దైనశైలిలో జనాన్ని నమ్మించేలా ఒక్కోచోట ఒక్కో రకంగా జిల్లా కేంద్రం చేస్తామని హామీలు గుప్పించారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌స్గిగల్ ఇచ్చింది. మరో 50నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయి. పూర్వపు జిల్లాకే రాజంపేట నియోజకవర్గం వెళ్లనుందని రాజకీయపరిశీలకులు భావిస్తున్నారు.

రెవెన్యూలో ఐఏఎస్ పాలన...

బ్రిటీషు కాలం నుంచి ఐఏఎస్‌పాలన ఉన్నప్పటికీ రాజంపేటకు అదే కొత్తేమి కాదు. ఇక్కడ ఐఏఎస్‌గా తొలిపోస్టింగ్ చేసిన వారు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హోదా వరకు వెళ్లారు.1915 నుంచి రాజంపేట సబ్ కలెక్టరేట్ ఉండేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కానీ అంతకముందు నుంచి బ్రిటీషు రెవెన్యూ పాలన కొనసాగింది. ఇప్పటికీ తెల్లదొరల రెవెన్యూ పాలనకు సబంధించి భవనాలు ఇక్కడ కనిపిస్తాయి.

రెవెన్యూ పాలన చేసిన ఐఏఎస్‌లు..

1953 నుంచి రాజంపేట డివిజన్ కేంద్రంగా కె.రామచంద్రన్, ఎంఆర్‌పాయ్, టీఎల్ శంకర్, డీ.ఆరోరా, ఎ.వల్లపన్, శ్రీరామచంద్రమూర్తి, ఎంఎస్‌రాజాజీ, సీఎస్ రంగాచారి,ఎస్,బాలకష్ణ, బాబురాం, అశోక్ కుమార్ గోయల్, జానకి కృష్ణమూర్తి, శర్మారావు సబ్‌కలెక్టర్లుగా ఉన్నారు. 1978 నుంచి మిస్సీమాథ్యుస్, ఎంహెచ్‌డీ సఫీక్యూజ్‌జామన్,రణదీప్‌సదన్, ఏసీ పునీత, అజయ్‌జైన్, ప్రీతీమీనా, కేతన్‌గార్గ్ తదితరులు సబ్‌కలెక్టర్లుగా పనిచేశారు. తాజాగా వైఖోమా నైదియాదేవి సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మూడున్నర దశాబ్దాల తర్వాత ఐపీఎస్ హోదా కలిగిన అధికారి చేతుల్లోకి ఖాకీపగ్గాలు వెళ్లాయి. ఉభయ జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలైన పులివెందుల, జమ్మలమడుగులో ఐపీఎస్ క్యాడర్ కలిగిన వారిని పోలీసు అధికారులుగా నియమించారు. అయితే ప్రశాంతతకు నిలయమైన రాజంపేటలో ఐపీఎస్‌హోదా కలిగిన అధికారిని నియమించడంతో త్వరలో రాజంపేటను జిల్లాకేంద్రంగా చేస్తారా అన్న ఆశలు జనంలో చిగురిస్తున్నాయి.



రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమానైదియాదేవి, పోలీసుశాఖకు సంబంధించి ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, జిల్లా అటవీశాఖాధికారిగా జగన్నాథ్‌సింగ్‌లు నియమితులయ్యారు. ఈమూడు శాఖలు కూడా కీలకమైనవే. కూటమిపాలనలో ఎర్రచందనం స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతోంది. ఇందుకు ఇటీవల పట్టుబడిన సంఘటనలే నిదర్శనం. అలాగే రెవెన్యూపరంగా భూవివాదాలు ఆరునెలల్లో అధికమయ్యాయి. పోలీసుశాఖ తన విధులు మరిచి రాంగ్‌రూట్‌లో సేవలందిస్తోందన్న అపవాదును మూటకట్టుకుంది. ఈ నేపథ్యంలో ఈ మూడు శాఖలకు జిల్లా హోదా కలిగిన ఉన్నతాధికారులే పాలన సాగిస్తున్న తరుణంలో వీరు ఏమేరకు పనితీరు కనబరుస్తారన్నది వేచిచూడాలి.

చేయాల్సినవి..

ఐఏఎస్ పరంగా.. రెవెన్యూ సబ్ డివిజన్ లో ప్రధానగా భూ వివాదాలు ఉన్నాయి. మండల రెవెన్యూ పాలన గాడిలో పెట్టాలి, పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులు పరిష్కారంలో కిండి స్థాయి అధికారుల్లో నిర్లక్ష్యం వీడేలా చేయాలి. రాజంపేట మండలంలో పట్టాదారు పుస్తకాలు త్వరగా ఇవ్వడం లేదు, భూ సమస్యలు పరిష్కారానికి ప్రతేక చర్యలు అవసరం.

- ఐపీఎస్ పరంగా మన్నూరు అప్‌గ్రేడ్ స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు భర్తీ చేయాలి, రాజంపేటటౌన్‌లో రెవెన్యూ, మున్సిపల్, పోలీసుశాఖ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ సమన్వయంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి. కళాశాలలకు నిలయమైన బోయినపల్లి ప్రాంతంలో పోలీసు అవుట్ పోలీస్ స్టేషన్‌ను తిరిగి అందుబాటులోకి తేవాలి. రాజంపేట పాత బస్టాండ్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించాలి, రాజంపేట టౌన్, బోయనపల్లిలో నైట్ బీట్ పెంచాలి, రోడ్ ప్రమాద నివారణ చర్యలు పటిష్టం చేయాలి, నిఘానేత్రాల వ్యవస్థను పటిష్టం చేయాలి. రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి, రాజంపేట ఏరియా హాస్పిటల్ లో ఔట్ పోస్ట్ నిరంతరం పని చేసేలా చేయాలి.
- ఐఫ్ఎస్ పరంగా నగర వనాలు అందుబాటులోకి తీసుకురావాలి, రాజంపేట రాయచోటి రోడ్డులోని రెడ్ వుడ్ జంగిల్ సఫారీని పునరుద్ధరించాలి. కడప– రేణిగుంట హైవే లోని రామాపురం చెక్ పోస్ట్‌లో సీసీ కెమెరాల వ్యవస్థను పునరుద్ధరించాలి, ఎర్రచందనం స్మగ్లింగ్ అడ్డుకట్టదిశగా చర్యలు చేపట్టాలి, సోమశిల బ్యాక్ వాటర్ లో ఎకో టూరిజంను తీసుకురావాలి.

క్లుప్తంగా

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం


లక్ష్మీకళావతి(ఫైల్)

మైలవరం : మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన గోరంట్ల లక్ష్మీకళావతి(20) అనే మహిళ కనిపించడం లేదని ఆమె భర్త మోదుకూరి రామాంజనేయులు ఫిర్యాదు చేసి 24 గంటలు గడవక ముందే ఆమె మైలవరం జలాశయంలో శవమై కనిపించింది. ఈనెల 18వతేదీ ఉదయం ఇంటినుంచి వెళ్లిన లక్ష్మీ కళావతి తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. సోమవారం కేసు నమోదు చేశారు. అంతలోనే ఆమె మైలవరం జలాశయంలో శవమై కనిపించింది. మైలవరం ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

వృద్ధుడి అదృశ్యం


పక్కీరప్ప (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న దర్గా వీధిలో నివాసం ఉన్న పక్కీరప్ప రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆయన భార్య, బంధువులు తెలిపారు. పలు ప్రాంతాల్లో గాలించినా ఎక్కడా ఆయన ఆచూకీ లభించలేదన్నారు. సోమవారం ఆయన మనవడు గంగాధర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

సింహాద్రిపురం : అగ్రహారం గ్రామానికి చెందిన ప్రభావతమ్మ (55) కడుపునొప్పి తాళలేక ఈనెల 17వ తేదీన పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న బంధువులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఈ నెల 19న మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు


మొబిలైజేషన్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బంది

- ఏఆర్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి
- మెరుగైన ఆరోగ్యంతోనే సమర్థవంతమైన విధులు
- యోగా, వ్యాయామం దినచర్యలో భాగంగా చేసుకోవాలి
- జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : పోలీసు శాఖలో సాయుధ బలగాల విభాగం (ఏ.ఆర్) కీలకపాత్ర పోషిస్తుందని, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు సూచించారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఏ.ఆర్ సిబ్బందికి నిర్వహిస్తున్న మొబిలైజేషన్‌లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శిక్షణా తరగతుల్లో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పాల్గొన్నారు. సిబ్బంది తమ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలన్నారు. ఏ.ఆర్ సిబ్బంది ఆయుధాల వినియోగం, నిర్వహణపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బందోబస్తు విధుల్లో పలు మెలకువలను సిబ్బందికి అదనపు ఎస్పీ (అడ్మిన్) వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఆర్ఐలు ఆనంద్, శివరాముడు, శ్రీశైలరెడ్డి, వీరేష్, టైటస్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీసీ సంక్షేమ సంఘం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించి జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల విధానాన్ని తీసుకు రావాలన్నారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా వెంటనే అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్లలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు వంద శాతం ఫీజు రీఎంబర్స్‌మెంట్ ప్రవేశ పెట్టాలన్నారు. యువత, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. జాతీయ స్థాయిలో ఓబీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. ఈడబ్ల్యుఎస్ పది శాతం రిజర్వేషన్లు తక్షణమే రద్దు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు బీసీల గురించి ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఇంతవరకు తమకు చేసిన మేలు అంటూ ఏమీ లేదని విమర్శించారు. తమ డిమాండ్లను విస్మరిస్తే రాష్ట్రంలోని బీసీలు కూటమి ప్రభుత్వాన్ని కూలదోస్తారని హెచ్చరించారు. బీసీ మహాసభ వ్యవస్థాపకుడు అవ్వారు మల్లికార్జున, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

వీరపునాయునిపల్లె : మండలంలం2014లో గుమ్మిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామక్రిష్టారెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో 12 మందిపై నేరం రుజువు కావడంతో ప్రొద్దుటూరు కోర్టు ముద్దాయిలకు మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 35 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుమ్మిరెడ్డి అరుణ, చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో పంచాయితీకి అని పిలిపించి చంద్రశేఖర్‌రెడ్డి అతని బంధువైన రామక్రిష్టారెడ్డిపై చప్పిడి నారాయణరెడ్డి, రాచమల్లు మధుసూదన్‌రెడ్డి, హరికిషోర్‌రెడ్డి, అరుణ, కోకటం సుధీర్‌కుమార్‌రెడ్డి, రాచమల్లు హరికేశవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, పాపిరెడ్డి, బాలమనోహర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, భైరవేశ్వర్‌రెడ్డి, హరిస్వామిరెడ్డి మారణాయుధాలతో దాడి చేశారు. అప్పటి ఎస్ఐ రోషన్ కేసు నమోదు చేశారు. వీరిపై నేరం రుజువు కావడంతో సోమవారం కోర్టు ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కడపలోని స్థానిక పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అదనపు ఎస్పీ ఫిర్యాదుదారులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి


దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని సూచించారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు, ఎస్డీసీ వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల వద్ద మృతుడి కుటుంబీకుల ఆందోళన


మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇటీవల అమృతానగర్‌లో శ్రీ చైతన్య పాఠశాల బస్సు ఢీ కొని మృతి చెందిన అబ్దుల్ మునాఫ్ కుటుంబీకులు సోమవారం స్థానిక సాయిరాజేశ్వరి కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఆందోళన చేశారు. శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన బస్సు కొద్దిరోజుల క్రితం విద్యార్థులతో వస్తుండగా అమృతానగర్‌లో మునాఫ్‌ను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి, పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. సినీహబ్ యజమాని బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, పాఠశాల ఏజీఎం నాగిరెడ్డిలు మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడిన నిందితులు, దుంగలతో ఎఫ్ఆర్ఓ ప్రణీతరావు తదితరులు

మైదుకూరు : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం చెట్లను నరుకుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వనిపెంట అటవీ రేంజ్ అధికారి ప్రణీతరావు తెలిపారు. నల్లమల్ల అడవిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించినట్లు సమాచారం అందడంతో డీఎఫ్ఓ వినీత్ కుమార్, సబ్ డీఎఫ్ఓ వి.దివాకర్ ఆదేశాలతో కూంబింగ్ నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ తెలిపారు. కూంబింగ్‌లో ఎర్రచందనం చెట్లను నరుకుతున్న వారిపై దాడి చేయడగా ఇద్దరు పట్టుబడ్డారని, మిగిలిన వారు పారిపోయారని ఆయన పేర్కొన్నారు. పారిపోయిన వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. విలువైన ఎర్రచందనం చెట్లను ఎవరైనా నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూంబింగ్‌లో డీఆర్ఓ అన్వర్ హుస్సేన్, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నట్లు వివరించారు.


దేవాలయ స్థలంలో అక్రమ కట్టడాలు

- పరిశీలించిన దేవదాయ, రెవెన్యూ అధికారులు
- ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వెల్లడి


దేవాలయంలోని నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి జాతీయ రహదారి నుంచి కొత్తపేట గంగమ్మ గుడికి వెళ్లే రోడ్డు పక్కనే గంగమ్మ గుడి సమీపంలో బుగ్గలేటిపల్లె గ్రామం సర్వే నంబర్ 22–2 (ఎల్‌పీ నెంబర్లు 185,187)లో 2.42 ఎకరాలు దేవాలయ స్థలం ఉంది. ఈ ప్రదేశంలోని గుడిలోని పురాతన శివలింగానికి పూర్వం వనం రామేశ్వరస్వామి పేరుతో భక్తులు పూజలు చేస్తూ ఉండేవారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఇక్కడి పురాతన శివలింగాన్ని దొంగలు అపహరించుకపోవడంతో భక్తులు నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించి, పక్కనే పార్వతిదేవికి గుడి నిర్మాణం చేసి పూజలు చేసుకుంటున్నారు. ఆ పక్కనే ఆంజనేయ స్వామి గుడి కూడా ఉంది. అయితే కడపకు చెందిన ఓ వ్యక్తి అతని కుమారుడు వేరే ప్రాంతంలో చనిపోగా ఇక్కడి దేవాలయ స్థలంలో పూడ్చి సమాధి నిర్మించారు. దానినే దేవాలయం అని భ్రమపడేలా నిర్మాణాలు చేస్తూ భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని, అన్నదాన కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నారని దేవదాయశాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. ఈ విషయాలపై పత్రికల్లోనూ వార్తలు రావడంతో దేవదాయ, రెవెన్యూ అధికారులు స్పందించారు. సోమవారం దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ రవిశేఖరరెడ్డి దేవాలయ స్థల పరిశీలనకు వచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది, బుగ్గలేటిపల్లె గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మికాంతమ్మ, సర్వేయర్ మౌలాతో సర్వే నంబరు 22/2లోని దేవాలయ భూమిని పరిశీలనకు పంపి దేవదాయ అధికారులు, ప్రజల సమక్షంలోనే కొలతలు వేయించారు. దేవాలయ భూమిలోనే సమాధులు, కొన్ని నిర్మాణాలు ఉన్నట్లు తేలింది. భక్తులు అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను కోరారు. ఈ విషయాలపై తహసీల్దార్ నాగేశ్వరరావును వివరణ కోరగా దేవాలయ స్థలంలోకే సమాధులు, వాటిపై దేవాలయ రూపంలోని నిర్మాణాలు వచ్చాయని, సర్వేలో తేలిన వివరాలు దేవదాయశాఖ ఉన్నతధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్యను వివరణ కోరగా బుగ్గలేటిపల్లె సర్వే నంబర్ 22–2 (ఎల్‌పీ నెంబర్లు) 185, 187లో 2.42 ఎకరాలు దేవాలయ భూమిగా రెవెన్యూ రికార్డులలో నమోదైందన్నారు. ఆ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తూ అపవిత్రం చేస్తున్నారని ఆరోపణలు రావడంతో పరిశీలించామన్నారు. కొలతలు వేయగా ఫిర్యాదులు వాస్తవమే అని తెలిసిందని, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యోగివేమన జయంతిని ప్రభుత్వం విస్మరించడం విచారకరం


మాట్లాడుతున్న ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు సురేంద్రారెడ్డి, సర్వోత్తమరెడ్డి

పులివెందుల టౌన్ : యోగివేమన తన నీతి పద్యాలతో సమాజాన్ని జాగృతం చేశారని, అలాంటి ప్రజాకవి జయంతిని ప్రభుత్వం విస్మరించడం విచారకరమని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యరప్రరెడ్డి సురేంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పులివెందుల పట్టణంలో వారు మాట్లాడుతూ 2023లో గత ప్రభుత్వం 164 జీఓ ద్వారా యోగి వేమన జయంతిని అధికారికంగా ప్రకటించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం యోగి వేమన జయంతిని విస్మరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యోగివేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు.

నెర్రవాడలో ఘర్షణ

- 18 మందిపై కేసు నమోదు

చాపాడు : మండల పరిధిలోని నెర్రవాడ గ్రామంలో ఆదివారం రాత్రి పిట్టి లక్ష్మీనారాయణ, చల్లా గంగయ్య వర్గీయులు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. పిట్టి లక్ష్మీనారాయణ వర్గానికి చెందిన పాపయ్య పొలంలో వరి గడ్డిలో చల్లా గంగయ్య వర్గానికి చెందిన ప్రతాప్ నీరు వేశాడనే కారణంతో ఇరువర్గీయులు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారికి గాయాలు కాగా ఒక వర్గం వారు ప్రొద్దుటూరులో, మరో వర్గం వారు కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సూర్యనారాయణ మాటలు నమ్మొద్దు

కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా చెప్పుకునే సూర్యనారాయణ కల్లబొల్లి మాటలను ఉద్యోగులు నమ్మొద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.విన్సెంట్ కుమార్, రామాంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూర్యనారాయణను ఇదివరకే సంఘం నుంచి బహిష్కరించినా ఆయన వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదన్నారు. ఆయన ఉద్యోగుల ప్రయోజనాలను పక్కన పెట్టి పాలకులకు తొత్తుగా మారాడని విమర్శించారు.

ఆమె నేత్రాలు సజీవం


కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్ర టెక్నీషియన్ హరీష్, తదితరులు

సింహాద్రిపురం : మనిషి మరణించాక.. దేహంతో పాటు నేత్రాలను మట్టిలో కలిపేయడం కంటే వాటిని దానం చేస్తే మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించొచ్చు. సింహాద్రిపురం మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఒంటెద్దు భారతి(54) సోమవారం మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. భర్త సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో నేత్ర సేకరణ కేంద్ర టెక్నీషియన్ హరీష్ మృతురాలి ఇంటికి వెళ్లి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు


సాధువును 108 వాహనంలోకి తరలిస్తున్న కానిస్టేబుళ్లు

కలసపాడు : మండలంలోని పాత రామాపురం, కలసపాడు మధ్యలోని తెలుగుగంగ ఎడమ కాలువ వద్ద సోమవారం ఓ సాధువు కంపచెట్లలో పడి ఉన్నాడు. అటుగా వెళుతున్న కలసపాడు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు జగదీష్, మొయినుద్దీన్‌లు గమనించి కంపచెట్లలో పడి ఉన్న సాధువును బయటికి తీశారు. వివరాలు అడుగగా నెల్లూరు జిల్లాకు చెందిన పశుపతి అని తెలుసుకుని సాధువును 108 వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న కానిస్టేబుళ్లను ప్రజలు అభినందించారు.

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఇందులో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణకు మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, సీఈఓ ఓబులమ్మ, డీపీఓ స్వరాజ్యలక్ష్మి, వయోజన విద్య డీడీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండికోటలో పెరిగిన పర్యాటకులు



పర్యాటకులతో సందడిగా మారిన గండికోట పరిసరాలు


ఇరుకు రహదారిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- పర్యాటక ఫీజులు వసూలు చేస్తున్నా సౌకర్యాలు కరువు
- ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోటలో పర్యాటకుల సంఖ్య పెరిగిపోతోంది. గండికోట అభివృద్ధి కోసం పర్యాటకశాఖ అధికారులు టోల్‌గేట్‌లను ఏర్పాటు చేసి వచ్చిన పర్యాటకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాగే వాహనాలకు రుసుం వసూలు చేస్తున్నారు. అయితే గండికోట వెలుపల వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ సౌకర్యం ఉన్నా వాహనాలు మాత్రం గండికోట లోపలికి ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయి. దీంతో గండికోటలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోట లోపల ఎలాంటి రోడ్డు నిర్మాణం చేయలేదు. కొంత వరకు మాత్రమే సీసీ రోడ్లు ఉన్నా మిగిలిన రోడ్డు గుండు రాళ్లతో ఉన్నాయి. ఒక్క వాహనం వెళ్లేందుకు మాత్రమే వీలుంటుంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్ స్తంభించిపోతుంది. వచ్చిన పర్యాటకులకు ఎలాంటి తాగునీటి వసతులు లేకపోవడంతో వాటర్‌బాటిళ్లు, ప్యాకెట్లు కొని తాగుతున్నారు. గండికోటలో కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో జిల్లా అద్భుత విజయం


విజేతలుగా నిలిచిన చిన్నారులతో ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : కర్నూలు నగరం బాలాజీనగర్‌లోని భాష్యం స్కూల్‌లో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో వైఎస్సార్ జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారులు అద్భుత విజయం సాధించారు. ఈ పోటీలో 23 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో డి. అష్రఫ్ సుభాని మొదటి బహుమతిగా రూ. 10,000 నగదు బహుమతిని గెలుచుకున్నారు. అలాగే టి. శ్రీకాంత్ 8వ స్థానం సాధించి రూ. 1,500 నగదు బహుమతి పొందారు. దీంతోపాటు సీనియర్స్ కేటగిరీలో అనీస్ దర్బారి మొదటి స్థానంలో నిలిచి రూ. 1,000 నగదు బహుమతి గెలుచుకున్నారు.

విభాగాల వారీగా బహుమతులు పొందినవారు..

జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో విభాగాల వారీగా పలువురు బహుమతులు సాధించారు. ఇందులో అండర్ –9 బాలికల విభాగంలో 2వ స్థానంలో లాస్యప్రియ, 3వ స్థానంలో అమీనా, అండర్ –11 విభాగంలో 2వ స్థానంలో దీపికా, అండర్ 15 విభాగంలో 2వ స్థానంలో తెజోవయి అలాగే అండర్ –7 బాలుర విభాగంలో 2వ స్థానంలో భార్గవ్, అండర్ –13 విభాగం 4వ స్థానంలో అనురాగ్, 5వ స్థానంలో ప్రేమదీప్ నిలిచారు. వీరి విజయం జిల్లాకు గర్వకారణమని జిల్లా చెస్ సంఘం సెక్రటరీ అనీస్ దర్బారీ అన్నారు.